కథా నిలయం
5236
శ్రీకాకుళం

# నిశ్చితార్థం

## 1

"అట్లా గాదమ్మమ్మా! ఇది నాన్నవల్ల గాదులే, తేలిపోయింది. ఈ మాటు నీకు యేదైనా సంబంధమందితే ఆ పెళ్ళికొడుకును వచ్చి నాతో మాటాడమని చెప్పు. నే నిశ్చితార్థం చేసుకుంటాలే, తాంబూలాలు పుచ్చుకునేట్టు చూస్తా, ఇంక అదొక్కటే మార్గం" మనుమరాలు నవ్వుతూ మాతామహితో అన్నది.

మాతామహికి మేచస్ చూడటం హాబీ.

పరీక్ష పేపర్లు వ్రాసేప్పుడు, తెలుగు పరీక్షలో ప్రశ్న? దమయంతి మాటాడిన ప్రౌఢ వచనములెవ్వి? అని చదివి జవాబు వ్రాసింది మనుమరాలు.

ప్రౌఢ అంటే పెళ్ళికూతురుకి సుమారుగా ముప్పై దగ్గర పడుతున్నాయని చెప్పచ్చు. నాజూగ్గా చెపితే లేట్ ట్వెంటీస్ అనచ్చు. రాజారవివర్మ హంస దూత్యము అని చిత్రించాడు వర్ణచిత్రం, హంస చెప్పేది వింటున్న దమయంతికీ అంత వయస్సున్నట్టే కనపడుతుంది.

నలుడు దూతగా పంపబడి వచ్చి దమయంతితో ఇంద్రాగ్ని యమ వరుణులలో ఒకరిని వరించమని దౌత్యము నెరపగా దమయంతి ప్రౌఢలాగా జవాబిచ్చింది. అనల సంబంధ వాంఛనా కగునయేని అనలసంబంధ వాంఛనాకగును జూవె. దాహమౌతుంటే మంచి తీర్థమిస్తే దాహార్తి తీరుతుంది. నెయ్యి తాగమని అందిస్తే తాగుతారా? అంటుంది దమయంతి.

అలాగా యిక్కడా బ్రైడ్ ప్రౌఢలాగా మాతామహితో తన మనసులోని విషయం చెప్పింది.

యెదురు చూస్తుండగా వరుడు నేరుగా వచ్చాడు, తానె వరో తానే యెరుకపరచుకున్నాడు.

చిన్నవారు బడికి వెళితే, తండ్రి ఆఫీసుకెళ్ళాడు.

మీ మాతామహి మీ చిరునామా యిచ్చారు, సంగతి చెప్పారు, వచ్చాను అన్నాడు నవ్వుతూ.

చూస్తూనే ప్రౌఢ బ్రైడ్ ఊహించింది. ద్వితీయమో తృతీయమో అని నవ్వుకున్నది, వయసూ అంచనా వేసింది, ముప్ఫై నలభై మధ్య ఉండచ్చు, మర్యాదలు చెల్లించి కాళ్ళకు నీళ్ళిచ్చి, దాహశాంతికి, కుండలో నీరు చల్లనిది అందించింది, కుర్చీ వేసింది, తాను చించాప పరిచి దానిమీద పెళ్ళిచూపుల ఫోజులో కూచున్నది.

పెళ్ళికొడుకు తన సంస్కృతి వెల్లడించాడు, నవ్వుతూ చెప్పాడు, నాకు కట్నం కానుకా మీద లేదు, మనసు విప్పి మాటాడే అమ్మాయి కోసం అన్వేషిస్తున్నాను, నాకు దాపరికమూ లేదు, గర్వమూ లేదు, అందరికీ వుండే స్వంత డబ్బు ఉన్నదనుకోండి, పెళ్ళి చేసుకుని భార్యను వెంటబెట్టుకు వెళ్ళ అనేదే ఆశయం, శాస్త్రీయంగా చేస్తే చాలు, మీ తండ్రిగారికి శాస్త్రీయపద్ధతే యిష్టమని విన్నాను, లాంఛనాలూ గట్రా బాదరబందీ ఉండదు, పెళ్ళికి హాజరయేవారికి విడిది యిచ్చి, విందు యిస్తే చాలు, నాకు స్నాతకం ఉండదు. దాంతో ఒక ఆచారం తగ్గిపోతుంది.

అంటే, ద్వితీయమనా చెపుతున్నాను, మీకు కట్నం కానికా అక్కర్లేనట్టే. నాకు ద్వితీయమైనా, తృతీయమైనా, చతుర్థమైనా, పిల్లలున్నా యిబ్బంది లేదు. నాకన్న చిన్న వారిని సాకుతూనే వున్నా, పెళ్ళి చేసుకుని భర్తతో వెళ్ళిపోవా లని ఆశిస్తున్నా, ఇంకా యేమన్నా చెప్పాలనుంటే చెప్పె యచ్చు. సంశయించక్కర్లేదు, మీ యితర ఆశయాలూ అల వాట్లూ తెలుసుకుంటాను. ఒకరినొకరు అర్థం చేసుకుని పెళ్ళా డితే మంచిది, తగవులు రావు అని కళ్ళెత్తి చూసి నవ్వి తల వంచుకున్నది.

పెళ్ళికొడుకు గుండె ఝల్లుమన్నాది, యెంత బావున్నదో ఆ నవ్వు అనుకున్నాడు.

బావుంది, దుష్యంతుడు శకుంతలతో అన్నట్టు నాకు సంతు లేదు, మీకు సవతులు లేరు, ఉండరు, కానీ నేను మెడి కల్ రిప్రెజెంటెటివ్‌ని గనక, టూర్ చేస్తు ఉంటాను. నా విశి ష్టత యేమిటంటే, యే ఔషధాలైనా అమ్మగలను. నికరాదా యం ఫోర్ థౌజెండ్ వరకు ఉంటుంది. చిన్న యిబ్బంది యేమనగా, యెవరికి జబ్బుగా ఉన్నదని వార్త అందినా, రమ్మని అడిగినా, ఒంటెలాగా పరుగెత్తి పోయి వ్యాధి కుదిర్చి వస్తాను, ఈ లోపల నా భార్యే శీలసంపదను ఆమే కాపాడు కోవాలి, యెందువల్లనంటే తోడు వుంచి వెళ్ళను, అంతేగాక, నేను ఔషధాల వ్యాపారిని గదా, నా దగ్గర అన్ని రకాల ఔష ధాలూ రెడీగా ఉంటాయి గనక, వైద్యం చేయలేదా అనుకుని నమ్మకంతో, ఆడామగా పిల్లా మేకా దిగడుతూ ఉంటారు. అప్పుడూ నేను టూర్ చేయాల్సి రావచ్చు, తోకతెగిన నక్క

లాగా వరుగుదీస్తా, నాలుగూళ్ళు తిరిగి, నలుగురు వైద్యుల చేతా ఔషధాలు కొనిపించద్దూ మరి అని నవ్వుతున్నాడు.

ప్రౌఢ నవ్వింది, మొహం బాగా యెర్రబడింది, అసలే యెరుపు మనిషేమో, యింకా యెరుపు వచ్చి కెంపరంగుకు తిరిగింది.

మీరు చెప్పదలచుకున్నవీ చెప్పచ్చు.

థాంక్స్! యెక్కడెక్కడ తిరిగినా రాత్రి యేడున్నర కల్లా మీరు యింట్లో వుంటే బావుంటుంది. ఎక్స్ట్రా యెఫేర్సుండ రాదు, ఒకవేళ ప్రమాదవశాత్తూ జరిగినా, అదంతా నా దగ్గర వర్ణించరాదు, యేం జరగనట్టే వుండాలి. నేను కో యెడ్యు కేషన్ వెలిగించా గనక, మీవాళ్ళు నిందలు వేస్తారేమో, లేదా విడిగా వుండమంటారేమో, అవేం కుదరవు. నా పురుడూ పుణ్యం మీ వాళ్ళే చూడాలి. మా మాతామహి వృద్ధు అయింది, యేమీ చేయలేదు, తక్కినవి వినే వచ్చి వుంటారనుకుంటా అని భావగర్భింతం నవ్వుతూ తలెత్తి చూసింది.

అ, అ, వినే వచ్చా అన్నాడు పెద్దమనిషిలాగా.

థాంక్స్, నేను మీరు వెంటలేకుండా ఒంటరిగా యెక్కడికీ వెళ్ళను. ముఖ్యంగా, మీ వేపు బంధువుల యిళ్ళకి. యెందు కనంటే సూదికోసం సోదికి పోతే యేవో బైటపడినాయట, ఆ సామెత విన్నారా? అని బాగా నవ్వింది.

అ, అ, విన్నా అని వరుడూ నవ్వాడు.

పొద్దు వాటారుతున్నది, ఆఫీసు వదిలే వేళైంది. బడి నించి చిన్నవారు రాలేదు, ఆటలకు వెళ్ళి వుండాలి.

తండ్రి ఆఫీసునించి వచ్చేశాడు.

పెళ్ళికూతురు లేచింది, సంతోషంగా అన్నది.

నిశ్చితార్థం అయిపోయింది నాన్నా! మీ వెంట వచ్చిన పెద్ద మనుషులు నలుగురూ చాలనుకుంటా అని వెళ్ళి కుర్చీలు తెచ్చి వేసింది. అందరికీ కాళ్ళకు నీళ్ళు, తాగేందుకు చల్లని మంచి తీర్థం తెచ్చి కింద వుంచింది.

అంతా కూచున్నారు దాహశాంతి అయింది, వాళ్ళు మాట్లాడుకుంటుండగా, అమ్మాయి లోపలికి వెళ్ళి టీ చేసి కప్పులూ సాసర్లూ ట్రేలో వుంచి తెచ్చి వారిముందుంచింది.

తండ్రి అన్నాడు. విన్నావమ్మా, అన్నీ విన్నాను. టూర్ చేస్తాడట, ఇంటిదగ్గర ఒక్క తైవూ వుండాలేమో అని టీ అందుకున్నాడు.

తండ్రికి నచ్చలేదని కూతురు గ్రహించింది. తండ్రికి పెళ్ళినాటికి, యిల్లూ పొలమూ, డిగ్రీ ప్రభుత్వ ఉద్యోగమూ, వయసున్న పాతికేళ్ళే, కట్నం తీసుకోలేదు. తనకు కాబోయే భార్య ఉద్యోగం చేయ అవసరము లేదు అన్నాడని మాతామహి వల్ల విని ఉన్నది. ఈ పెళ్ళికొడుక్కి అటువంటి అర్హతలు లేవు, పైగా మొదటి సంబంధం గాదు, ఇల్లున్నది, బలగమున్నది అదెంత యిల్లో అనుకుని వుండాలి.

యేం చేస్తాం నాన్నా! పెళ్ళి చేసి పంపేయాలి గదా నన్ను, యెన్నాళ్ళు బ్రహ్మచారిణిని చూడగలరు? యెప్పుడో అపుడు తరిమేయాల్సిందే గదా, లేకపోతే అని చిన్నగా నవ్వి

ముక్కు నలుపుకుని నవ్వాపుకుని అన్నది. యేదో సాగితే పెళ్ళెందుకూ అని యిరుగుపొరుగు నిందలు వేస్తారు.

ఆ పౌఢ పక్షమే అక్కడున్న పెద్ద మనుషులూ మాట్లాడారు.

నిశ్చితార్థం కానీవయ్యా! యిలా యెన్ని వంకలు పెడతావు? నీ ఆర్థిక యిబ్బందులు వర్ణిస్తు నీళ్ళు నమిలితే పని జరుగుతుందా? అని ఝాకలేశారు, పెళ్ళికూతురుతో అన్నారు.

తీసుకురా అమ్మా! వచ్చి బొందాం, ఆకూ వక్కా వసుపూ కుంకం పూలూ చాలు.

అందరూ కుర్చీలు దిగి చాపలమీద కూచున్నారు. ఉత్తరీయాలు దిద్దుకున్నారు.

కాబోయే అల్లుడుగారూ! మీరూ తెచ్చారా? తెచ్చినట్లున్నారే, పిల్ల నచ్చినట్టున్నది, మీ మొహం వెలిగిపోతున్నది, మా ఆఫీసరుగారమ్మాయి మీకు లభ్యం కావటం మీ అదృష్టం అన్నారు. అమ్మాయి పెద్ద యిత్తడి పళ్ళెంలో అన్నీ వుంచి తెచ్చి, వారిమధ్య పెట్టింది. పెళ్ళికొడుకు జేబులోంచి చిన్న పొట్లం తీసి, బంగారుకాసు తాంబూలంలో వుంచాడు, మందుల సంచీలోంచి కొత్త చీరా జాకట్టు గుడ్డా వున్న పొట్లం పళ్ళెంలో వుంచాడు.

పెళ్ళి చేసి పిల్లను పంపిస్తానంటే, ఇంకేమీ లాగాలని ప్రయత్నించినా రావు అని ఖరారు చేశాడు తండ్రి, అందరి వంకా చూశాడు.

అంగీకారమే అని తమాషాగా నవ్వాడు పెళ్ళికొడుకు, తక్కినవాళ్ళూ తెలుసులే అని నవ్వారు.

తీసుకోమ్మా, బొట్టు పెట్టుకుని పళ్ళెం తీసుకో అని పళ్ళెం తాకి అందించారు, మాకు మంచి విందు యివ్వాలనీ, వచ్చే యేటికల్లా మనమడినివ్వాలనీ ఆశీర్వదిస్తున్నాము అన్నారు.

వారిలో పెద్ద అన్నాడు, ఇవాళ శనివారం వెంకటేశ్వరునికి దీపం వెలిగించి, ఊదొత్తులు వెలిగించి టెంకాయ కొట్టు మీ వంటి సజ్జనుడు భర్తగా రావాలని మా అఫీసరుగారమ్మాయి శనివారాలున్నది అల్లుడూ, చిన్నవారిని దయతో సాకుతున్నది.

దీపాలు వెలిగినై, పిల్లలు వచ్చారు.

అందరూ లేచారు.

పెళ్ళికూతురు బొట్టు పెట్టుకుని పళ్ళెంతో లోపలికెళ్ళింది.

[] [] []